క్లుప్తంగా

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను శంకర్ ఫౌండేషన్‌కు తరలిస్తున్న వైద్య సిబ్బంది

బుచ్చెయ్యపేట : వడ్డాది గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ అనకాపల్లి వారి సౌజన్యంతో, ఎస్ఆర్ విజన్ సెంటర్ వడ్డాది వారి సహకారంతో శంకర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 75 మంది రోగులకు వైద్యులు సత్యవతి, నాయుడు, రాజు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఆపరేషన్ అవసరమైన 32 మందిని శంకర్ ఫౌండేషన్‌కు తీసుకెళ్లి ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తామని ఫౌండేషన్ క్యాంప్ మేనేజర్ అరుణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దీపిక పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బుచ్చెయ్యపేట : మండలంలో వడ్డాదిలో మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నేల వేషాలు, బాణసంచా కాల్పులతో అమ్మవారి ఘటాలు ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ, మజ్జిగ, పొంగడాలు ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పెద్దింటమ్మ అమ్మవారికి ఇత్తడి కుందులు బహూకరణ



అమ్మవారికి కుందులు అందజేస్తున్న భక్తులు

రావికమతం : కొత్తకోటలో వేంచేసి ఉన్న పెద్దింటమ్మ అమ్మవారికి భక్తులు విశ్వ బ్రాహ్మణుల సంక్షేమ సంఘం నాయకులు వేమవరపు రమణ, మండల వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి శీలం శంకర్రావు గురువారం ఇత్తడి కుందులు సమర్పించి దీపారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గవర వీధిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ రామధర్మజ

మాడుగుల : స్థానిక గవర వీధిలో మండల పరిషత్ నుంచి అందజేసిన ఎంపీటీసీ నిధులు రూ.2లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ రామధర్మజ, సర్పంచ్ కళావతి, ఉప సర్పంచ్ వరహాలు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తిబాబు, హేమంత్‌కుమార్, చిన్నారావు, ఈశ్వరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీలో గట్టి పునాది వేయాలి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను ప్రశ్నిస్తున్న సీడీపీవో శశికళ

మాడుగుల రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ప్రీ ప్రైమరీలో గట్టి పునాది వేసుకోవాలని ఐసీడీఎస్ మాడుగుల ప్రాజెక్టు అధికారి శశికళ అన్నారు. గురువారం ఆమె మండలంలో కస్పా జగన్నాథపురం 5వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం చిన్నారులతో రైమ్స్ చెప్పించారు. అక్షరాలు అడిగారు. విద్యార్థులు అడిగిన రైమ్స్‌తో పాటు అక్షరాలు గుర్తింపు రావడంతో కార్యకర్త ధనలక్ష్మిని అభినందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలు పాల్గొన్నారు.



పార్వతీపురం గ్రామంలో వీధి రోడ్డు దుస్థితి

శివారు గ్రామం.. అడుగేస్తే దుర్గంధం

- వీధి రోడ్లలో నిత్యం ప్రవహిస్తున్న మురుగునీరు
- బోర్లు, కుళాయిల్లో కలుషితమవుతున్న తాగునీరు
- గ్రామంలో పెరుగుతున్న అంటు రోగాలు
- శివారు గ్రామం కావడంతో కన్నెత్తి చూడని అధికారులు

నాతవరం : రోడ్లపై నిత్యం మురుగునీరు ప్రవహించడంతో బోర్లలో కుళాయిలలో తాగునీరు కలుషితం అవుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చెర్లోపాలెం పంచాయతీ శివారు పార్వతీపురం గ్రామంలో వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో గ్రామస్తులు ఇంటి వద్ద వాడే నీరు వీధుల్లో నిత్యం ప్రవహిస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత నీటి ప్రవాహం పెరిగి మురుగు నీరంతా బోర్లలోకి కుళాయిల్లోకి వెళ్లి కలుషితం అవుతుంది. బోర్ల వద్దకు తాగునీరు తెచ్చుకోవడానికి మురుగు నీటిలోంచి నడిచి వెళ్లడంతో చాలా మందికి అంటురోగాల బారిన పడుతున్నారు. **గ్రామస్తులు కలుషిత నీరు తాగడం వల్ల తరుచూ జ్వరాలు వ్యాపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో ప్రతి ఇంట్లో జ్వరాలతో బాధపడుతున్న వారు ఉన్నారు.** గ్రామంలో కొందరు ఇంటి వద్ద ఉన్న మరుగుదొడ్లలో వాడిన నీటిని సైతం వీధి రోడ్డులో ప్రవహించేలా చేస్తున్నారు. ఈ విధంగా చేయడం వల్ల ఆయా వీధుల్లో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. శివారు గ్రామం కావడంతో అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కళ్ల ముందే నిత్యం ప్రవహించే మురుగు నీటిని అరికట్టేవారు కరువయ్యారని గ్రామస్తులు అంటున్నారు. గ్రామంలో పూర్వం నుంచే ప్రజలు మంచినీళ్లు తెచ్చుకునే బోరులో మురుగునీరు పోవడంతో కలుషితమై దుర్గంధం వెదజల్లుతుందని చెబుతున్నారు. ఈ బోరులోకి బయట నీరు రాకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే వీధుల్లో మురుగునీరు ప్రవాహం ఇదే విధంగా కొనసాగితే గ్రామస్తులంతా రోగాల బారిన పడతారని భయాందోళన చెందుతున్నారు. ఈ విషయంపై మండల పరిషత్ కార్యాలయ సూపర్‌డెంటు పార్థసారథి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.



నిత్యం మురుగునీరు ప్రవాహం



గ్రామంలో ఎక్కడ చూసే ఇదే దుస్థితి



కలుషితమైన బోరులో నీళ్లు పట్టుకుంటున్న వ్యక్తి

చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వివరిద్దాం

- మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు పిలుపు
- తారువలో 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ ' ప్రచార సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు చేసిన మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఈ మేరకు దేవరాపల్లి మండలం తారువలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' పేరిట మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశం స్థానిక మండల అధ్యక్షుడు బూరె బాబూరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెచ్చే క్యూఆర్ కోడ్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ముత్యాలనాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి శతశాతం హామీలను అమలు చేశారని గుర్తు చేశారు. బూటకపు హామీలతో నమ్మించి ప్రజలను మోసగించడం చంద్రబాబుకు అలవాటేనని ఎద్దేవా చేశారు. మొదట ఏడాది పింఛను తప్ప అన్ని హామీలను ఎగ్గొట్టారని విమర్శించారు. తల్లికి వందనం ప్రతి పిల్లాడికి ఇస్తామని చెప్పి కరెంట్ బిల్లు ఎక్కువ వచ్చిందని, కార్లు ఉన్నాయని కుంటిసాకులు చూపి ఎందరో పిల్లలకు కోత విధించారన్నారు. రైతులకు ఏడాదికి రూ. 20 వేలు పెట్టుబడి సహాయం, 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు 1500, నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు, లేకుంటే నెల రూ. 3వేల నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పింఛను వంటి హామీల అమలు ఎక్కడ అని కూటమి నేతలను ప్రశ్నించారు. ఉచిత బస్సులో మహిళలు రాష్ట్ర మంతటా ప్రయాణించవచ్చునని చెప్పి ఇప్పుడు మాట మార్చి నియోజకవర్గం దాటితే టికెట్ తీసుకునేలా షరతులు విధించడం దుర్మార్గమన్నారు. జగన్ పాలనలో నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలను మారిస్తే..కూటమి విధానాలతో నేడు పాఠశాలలు మూత పడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఏటా మూడు గ్యాస్ బండలు ఉచితమని చెప్పి, ఒక్కసారి మాత్రమే అరకొరగా ఇచ్చి సగానికి పైగా ప్రజలకు నగదు జమ చేయలేదన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజలంతా గ్రహించారని, అందుకే ప్రజలంతా కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతో ఉన్నారన్నారు. మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడ పర్యటించినా జనం ఉప్పెనలా తరలిరావడం ఇందుకు నిదర్శనమన్నారు. జగన్‌కు వస్తున్న జనాదరణను చూసి చంద్రబాబు సహా కూటమి నేతలకు భయం పట్టుకుందన్నారు. 2029లో జగన్ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు మోసాలను, కూటమి 14 నెలల పాలనలో పథకాలు అమలు చేయకుండా ఎగ్గొట్టడంతో జరిగిన నష్టాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీ పంచాడ సింహాచలంనాయుడు, సీనియర్ నాయకులు చింతల సత్య వెంకటరమణ, డా. సింహాచలంనాయుడు, ఉగ్రాకుల అప్పారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరదపురెడ్డి లలితానాయుడు, ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, మండల యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, మండల ఉపాధ్యక్షులు చల్లా నాయుడు, బండారు దేముడునాయుడు, జనరల్ సెక్రటరీ గూడెపు రాము, మండల మహిళా అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు వేచలపు వాణి, ఎంపీటీసీలు నారాయణమ్మ, బండి గౌరమ్మ, గంగవంశం రజని పాల్గొన్నారు.

ఎస్ఐ మల్లేశ్వరరావు ఆకస్మిక బదిలీ

దేవరాపల్లి : దేవరాపల్లి ఎస్ఐ టి.మల్లేశ్వరరావు ఆకస్మిక బదిలీ అయ్యారు. అతని స్థానంలో పరవాడ ఎస్ఐ సత్యనారాయణను నియమించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఆదేశాలు అందినట్లు సమాచారం. ఏడాది క్రితం బదిలీపై వచ్చిన ఎస్ఐ మల్లేశ్వరరావును ఆకస్మికంగా బదిలీ చేయడానికి గల కారణాలు తెలియరాలేదు. ఇతని స్థానంలో నియమితులైన ఎస్ఐ సత్యనారాయణ శుక్రవారం విధుల్లో చేరే అవకాశం ఉంది.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

నాతవరం : మండల కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ స్థానిక కళ్యాణ మండపంలో నిర్వహించే పార్టీ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ విచ్చేస్తారన్నారు. కార్యక్రమానికి మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు విధిగా హాజరు కావాలన్నారు.

రిటైర్డ్ కార్మికులకు సన్మానం

నర్సీపట్నం : ఉద్యోగ విరమణ పొందిన మున్సిపల్ కార్మికులను ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయు) ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి కార్మికులకు శాలువ కప్పి సత్కరించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, యూనియన్ నాయకులు రాజు, శ్రీను, రమణ, వరలక్ష్మి, బాబురావు లోవరాజు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి చర్యలు

రోలుగుంట : జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల వసతుల కల్పన, విద్యాప్రమాణాల మెరుగుకు అన్ని రకాల చర్యలు తీసుకోనున్నట్టు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టి.వి.శేషగిరిరావు తెలిపారు. పాఠశాల పీఎంసీ చైర్మన్ కొయ్యా సత్తిబాబు, సీనియర్ ఉపాధ్యాయుడు ఆర్.వి.ఎస్.ఆర్. శర్మతో పాఠశాల అభివృద్ధిపై సమావేశమయ్యారు. అనంతరం హెచ్‌ఎం విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి రైజింగు ఆఫ్ ఇండియా పథకం కింద పాఠశాలలో కెమెస్ట్రీ ల్యాబ్‌కు రూ. 15 లక్షలు, క్రీడా మైదానం అభివృద్ధికి రూ.5 లక్షలు మంజూరు అయ్యాయని, త్వరలోనే ఆ నిధులుతో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.

న్యాయం జరిగే వరకూ ఆందోళన

మాకవరపాలెం : క్వారీ కారణంగా నష్టపోతున్న దళితులకు న్యాయం జరిగేవరకు ఆందోళన సాగిస్తామని సీపీఎం, బీఎస్పీ నేతలు ఈరెల్లి చిరంజీవి, బొట్టా నాగరాజు అన్నారు. జీ కోడూరులోని సర్వే నంబర్ 332లో ఇచ్చిన క్వారీ లీజులను రద్దు చేయలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేయగా మైన్స్ అధికారులతో గురువారం విచారణ చేయిస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారని వారు తెలిపారు. కానీ కేవలం వీఆర్వో, సర్వేయర్‌నే పంపించారన్నారు. మైన్స్ అధికారులతో విచారణ చేయించి, న్యాయం చేసే వరకు ఆందోళన చేస్తామన్నారు.

ప్రకృతి సేద్యం లాభదాయకం



ప్రాజెక్టు అధికారి లచ్చన్నతో సిబ్బంది

నర్సీపట్నం : ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే లాభాలను రైతుల్లోకి తీసుకెళ్లి, సాగుపై మక్కువ పెంచాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు అధికారి లచ్చన్న వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. ఏడీఏ కార్యాలయంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై కన్వర్జెన్సీ మీటింగ్ నిర్వహించారు. రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ ప్రకాష్ మాట్లాడుతూ రైతులకు నిరంతరం ఆదాయం వచ్చే పంటలను ప్రకృతి వ్యవసాయంలో సాగు చేయాలన్నారు.

నేడు వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ విస్తృత స్థాయి సమావేశం

మాడుగుల : ఈ నెల 18వ తేదీన మాడుగుల బసవా రామపరమేష్ గౌడోన్ వద్ద వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి ప్లీనరీ సమావేశం జరగనుందని, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటలకు జరగనుందన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు హాజరు కానున్నారన్నారు. మండలంలో 29 పంచాయితీలు నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు.

నేడు ఏడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాడుగుల: మండలంలో ఏడు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నర్సీపట్నం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. మాడుగుల మండలంలో కొత్తగా ప్రతిపాదించిన కింతలి సబ్‌స్టేషన్ లైన్ పనులు, చెట్లకొమ్మల నరికివేత పనుల నిమిత్తం కింతలి, కింతలి వల్లాపురం, అవురువాడ, ఎం.కోడూరు, సాగరం, శంకరం, తాటిపర్తి, పంచాయతీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంకాలం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

కె.కోటపాడు : కలిగొట్ల ఫీడర్ పరిధి రొంగలినాయుడుపాలెంలో ఆర్‌డీఎస్ఎస్ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కె.కోటపాడు ఎలక్ట్రికల్ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని మేడిచర్ల, రొంగలినాయుడుపాలెం, పైడంపేట, మురుగుపాలెం, పాచిలవానిపాలెం, బత్తివారి కళ్లాల వద్ద విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. అలాగే 11 కేవీ పిండ్రంగి ఫీడర్‌లో కొరువాడ, ఆర్.వై.అగ్రహారం, పిండ్రంగి, గవరపాలెం, కె.జె.పురం, పోతనవలస, ఉగ్గినవలస గ్రామాల్లోనూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

వికసించిన బ్రహ్మకమలాలు



మాడుగులలో ఉపాధ్యాయురాలు ఇంటి ఆవరణలో విరిసిన బ్రహ్మకమలాలు

మాడుగుల రూరల్ : మండల కేంద్రంలో మసీదు వీధిలో నివాసం వుంటున్న ఉపాధ్యాయురాలు శ్రీమతి చెరుకూరి ఉష, గోవింద దంపతుల ఇంటి ఆవరణలో బ్రహ్మకమలాలు విరబూసాయి. బుధవారం రాత్రి ఒకేసారి 48 బ్రహ్మకమలాలు వికసించాయి. రాత్రి సమయంలో ఒక్కొక్కటిగా ఈ పుష్పాలు వికసించడంతో చుట్టు పక్కల కమలాల సువాసన వెదజల్లింది. దీంతో వాటిని చూడడానికి స్థానికులు బారులు తీరారు.

విశ్రాంతి షెడ్ ప్రారంభం



షెడ్‌ను ప్రారంభిస్తున్న కొత్తకోట సీఐ కోటేశ్వరరావు

రావికమతం : కొత్తకోట గ్రామ సమీపంలో ధర్మవరం- చలిసింగం రహదారిలో జోష్ మిషన్ సంస్థ లక్ష రూపాయలతో నిర్మించిన విశ్రాంతి షెడ్‌ను కొత్తకోట సీఐ జి. కోటేశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఫాదర్ కె.వర్గీస్ సారథ్యంలో జోష్ మిషన్ సంస్థను ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ విశ్రాంతి షెడ్ నిర్మాణం ద్వారా పాదచారులే కాకుండా రైతులకు కూడా ఉపయోగపడుతుందన్నారు.

పశుసంవర్ధక శాఖ సేవలపై అవగాహన కల్పించాలి

నర్సీపట్నం : పశుసంవర్ధక శాఖ చేపడుతున్న సేవలను రైతుల్లోకి తీసుకువెళ్లాలని వెటర్నరీ ఏరియా ఆస్పత్రి సహాయ సంచాలకులు డాక్టర్ రాంబాబు పేర్కొన్నారు. వైద్యులు, వైద్య సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు, లంపిస్కిన్ డిసీజ్, లింగ నిర్ధారణ, వీర్యనాళికలు గురించి రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ఈ సందర్భంగా బదిలీపై వచ్చిన వైద్యులు, బదిలీపై వెళ్లిన వైద్యులను సత్కరించారు.

పశువులకు థైలేరియం నివారణ టీకాలు



కె.జె.పురంలో టీకాల కార్యక్రమం పరిశీలిస్తున్న ఏడీ చిట్టినాయుడు



చౌడువాడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి నాయుడు

కె.కోటపాడు : పాడి పశువులకు రైతులంతా తప్పకుండా థైలీరియా వ్యాధి రాకుండా టీకాలు వేయించాలని చౌడువాడ పశువైద్యాధికారి నాయుడు సూచించారు. చౌడువాడ, మల్లంపాలెం గ్రామాల్లో గురువారం 278 పశువులకు థైలీరియా వ్యాధి నివారణ టీకాలు వేశారు. థైలీరియా వ్యాధి ప్రధానంగా సంకర జాతి పశువులలో వస్తుందన్నారు. టీకాల ద్వారా వ్యాధి నివారించుకోవాలన్నారు. పశుసంవర్థకశాఖ సహాయకులు కనకారావు, జగన్నాథం పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: మాడుగుల ఏరియా పశువైద్యశాల పరిధిలో ఉచిత థైలీరియా వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఏరియా పశువైద్యశాల ఏడీ చిట్టినాయుడు గురువారం పరిశీలించారు. మాడుగుల ఏరియా పశువైద్యశాల పరిధిలో చీడికాడ మండలానికి 3600 డోసులు, మాడుగుల మండలానికి 5,400 డోసులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మూడు మాసాలు వయస్సు దాటిన ఆడ మరియు మగ సంకర జాతి పశువులకు పాడి రైతులు ఈ టీకాలు తప్పనిసరిగా వెయించాలని చిట్టినాయుడు రైతులుకు సూచించారు.

పారదర్శకంగా సాగుదారులను గుర్తించాలి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఉమాశంకర్‌గణేష్

మాకవరపాలెం : పారదర్శకంగా సాగుదారులను గుర్తించాలని తహసీల్దార్ వెంకటరమణను మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ కోరారు. రాచపల్లి రెవెన్యూలోని 737 సర్వే నంబర్‌లో గల బంజరు సాగుదాల గుర్తింపునకు సర్వే జరుగుతోంది. అయితే ఈ సర్వేలో ఎంత విస్తీర్ణంలో సాగులో ఉన్నదీ రైతులకు తెలియజేయడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో గురువారం తహసీల్దార్‌ను కలిసారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ సాగుదారులకు విస్తీర్ణం తెలియజేయాలన్నారు. సాగుదారుల ఎంపికలో పారదర్శకత పాటించడం తోపాటు పరిశ్రమలకు ఈ భూములు కేటాయిస్తే రైతుల సేచనలు, సలహాలు కూడా తీసుకోవాలని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట ఎంపీపీ సర్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నేతలు యర్రా పాత్రుడు, నియోజకవర్గ పంచాయతీరాజ్ అధ్యక్షుడు బి.గోవిందరావు, జిల్లాప్రచార కమిటీ అధ్యక్షుడు పిల్లా శ్రీను, భద్రాచలం, సత్యనారాయణ, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రయాణికుల సౌకర్యాల కల్పనకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం ధీరజ్

గొలుగొండ : కృష్ణదేవిపేట(ఏఎల్‌పురం) బస్ స్టేషన్ పరిధిలో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా కాంప్లెక్సు ముందు భాగంలో సీసీ ర్యాంప్ నిర్మాణం చేయడం జరిగిందని నర్సీపట్నం ఆర్టీసీ డీఎం ధీరజ్ తెలిపారు. కృష్ణదేవిపేట బస్ కాంప్లెక్సు పరిధిలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో ఆర్టీసీ పరంగా కావాల్సిన మౌలిక సదుపాయాలు స్థానికుల నుంచి డీఎం అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ లోచల సుజాత మాట్లాడుతూ కాంప్లెక్సు పరిధిలో ప్రయాణికులకు తాగునీటి సమస్య ఉందన్నారు. ఎంపీపీ పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్సు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చన్నారు. కాంప్లెక్సు పరిధిలో రూ.6 లక్షలతో సీసీ ర్యాంప్ వేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎంఎస్ఎం రావు, ఎంపీటీసీ సభ్యులు చింతల బుల్లిప్రసాద్, బొడ్డు జమీలు, చిటికెల చిట్టిబాబు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిల ప్రమాణ స్వీకారం

నాతవరం : మండలంలో మూడు పీఏసీఎస్‌లకు పర్సన్ ఇంచార్జిలుగా అధికారులు గురువారం ప్రమాణ స్వీకారం చేయించారు. నాతవరం పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జిగా అపిరెడ్డి మాణిక్యం, డైరెక్టర్లుగా అప్పన సత్యనారాయణ, శెట్టి లోవరాజు, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జిగా సింగంపల్లి సన్యాసిదేముడు, డైరెక్టర్లుగా అంకంరెడ్డి రామకృష్ణ , బొబ్బర జ్యోతిబాబు, పీకేగూడెం పర్సన్ ఇంచార్జిగా అంకంరెడ్డి నానిబాబు, డైరెక్టర్లుగా గాడి లచ్చబాబు, చింతకాయల గంగరాజులతో ప్రమాణ స్వీకారం చేయించారు. వారిని డీసీసీబీ అధికారులతో పాటు తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ సత్కరించారు.

దేవరాపల్లి : మండలంలోని ములకలాపల్లి, ఎం. అలమండ పీఏసీఎస్‌లకు నూతనంగా ఎంపికైన త్రిసభ్య పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ఆయా సొసైటీలలో గురువారం జరిగాయి. ములకలాపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా చామంతుల సన్యాసిరావు(బాలు), డైరక్టర్లుగా రొంగలి గోవిందరావు, బోకం సోమేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఎం. అలమండ పీఏసీఎస్ చైర్మన్ గొర్లి గోవింద, డైరెక్టర్లుగా యాళ్ల అప్పలనాయుడు, బొడ్డు వెంకటరావు స్థానిక పీఏసీఎస్‌లో బాధ్యతలు స్వీకరించారు.

మాడుగుల రూరల్ : వీరనారాయణం పీఏసీఎస్ నూతన త్రిసభ్య కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం గురువారం సొసైటీ ఆవరణలో జరిగింది. నూతన చైర్‌పర్సన్ ఇన్‌చార్జిగా పతివాడ వరహాలునాయుడు, సభ్యులుగా దాడి కనక అప్పారావు, రాకోటి చిన్నోడులు ప్రమాణ స్వీకారం చేశారు. సంఘ సీఈఓ తురుబిల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

నాతవరం : సమాజాభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యపడుతుందని వైఎస్సార్‌సీపీ ములగపూడి గ్రామ కమిటీ అధ్యక్షుడు లోకవరపు సత్తిబాబు అన్నారు. మండలంలో ఎం.బెన్నవరం పంచాయతీ శివారు ములగపూడి గ్రామానికి చెందిన చింతకాయల మణికంఠస్వామి సొంతంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సుమారుగా 65 మంది విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ ఇతర సామగ్రి ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తే మరింత అభివృద్ధి చేసేందుకు దోహదపడుతుందన్నారు.